

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,12 మే 2025

8 పేజీలు


### అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా

# కూటమి పరిపాలన

**-మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**



**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** అంబేద్కర్ ఆశయాలు కనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి కొత్తపేట మండలం పలివెల పెద్ద పేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా పలివెల పెద్ద పేట గ్రామ సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అంబేద్కర్ జీవితం వివక్షతో మొదలైనప్పటికీ ఆయన పట్టుదలతో శ్రమించి ఉన్నతస్థానాలను అధిరోహించారన్నారు.న్యాయవాదిగా,మంత్రిగా,రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్గా పనిచేశారని గుర్తు చేశారు.అంబేద్కర్ మహిళలు వెనుకబడిన తరగతులు ఎస్సీ,ఎస్టీల హక్కుల కోసం పోరాడారన్నారు. అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్ల ఫలితంగానే సమాజంలో వెనుకబడిన తరగతుల వారుఉన్నత స్థాయిలకు చేరారన్నారు.ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించి,అవకాశాలు ఇస్తున్నప్పటికీ చాలామంది ఇంకా చదువులు పూర్తి చేయలేకపోవడం దురదృష్టకరమన్నారు.సమాజంలో వివక్షను ఎదుర్కొంటూ ఎటువంటి సదుపాయాలులేని పరిస్థితుల్లో కూడా అంబేద్కర్ విదేశాలు వెళ్లి ఉన్నత చదువులు అభ్యసించి దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు. నేటి యువత కూడా ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయిలను చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువులతోపాటు ఉద్యోగాలు ఉపాధి సంపాదించడం కూడా ముఖ్యమన్నారు. అంబేద్కర్ ఆశయాలు కనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. గురుకులాలు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి గురుకులాలు వసతి గృహాల విద్యార్థులకు కాస్మొటిక్ కిట్స్ ఇవ్వడంతో పాటు, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. 143 కోట్ల రూపాయలతో సంక్షేమ వసతి

- తరువాయి 2లో..

### సోమవారం మే 12వ తేదీన

## యధావిధిగా పిజిఆర్ఎస్



- వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా పౌర సేవలు పొందవచ్చు
- టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి సమస్యలు తెలియచేసే, పరిష్కార స్థాయి తెలుసుకునే అవకాశం
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి


**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలు పరిష్కార కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ మే 12 వ తేదీ సోమవారం రోజున జిల్లాలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం “1100 – మీకోసం కాల్ సెంటర్” కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు మరియు నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకో వచ్చునని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్ ,మండల కేంద్రంలో మే 12 ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్

- తరువాయి 2లో..

### ఘనంగా లక్ష్మీ నరసింహ

# కళ్యాణ మహొత్సవం





**రాజమండ్రి,మేజర్‌న్యూస్ :** నరసింహ జయంతి సందర్భంగా స్థానిక గోదావరి గట్టున ఉన్న ఉత్తరాది మఠంలో సుధా పండితులు విజయ సింహాచార్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ నరసింహ కళ్యాణ మహొత్సవం కన్నుల పండుగగా జరిగింది.ఉత్తరాదిమఠం మరియు ఆంధ్ర మధ్వ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణ మహొత్సవంలో పండిత విజయసింహా ఆచార్ మాట్లాడుతూ కలియుగములో మానవుడు అనేకసమస్యలతో సతమతమవుతున్నారని వాటినుండి రక్షించబడాలన్న నరసింహస్వామి ప్రార్ధన మరియు జపం ఎంతో అవసరమనిఅన్నారు.ఉత్తరాది మఠాధిపతులు శ్రీసత్యాత్మతీర్థస్వామీజీ ఆధ్వర్యంలో దేశములో ఉన్న62 నరసింహ క్షేత్రాల నుండి సేకరించిన మృత్తిక మరియు జలం అన్నిటినీ కేంద్రీకృతం చేసి బెంగళూరుఉత్తరాదిమఠంలో సుమారు ఆరడుగులకు పైగా లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారని గుర్తు చేశారు. నరసింహస్వామి దర్శనం, ప్రార్ధన, జపం అన్ని మానవులకు ఎంతో రక్షణ కవచంగా ఉంటుందని చెప్పారు. రాజమండ్రి ఉత్తరాది మఠంలో ఉన్నశతాబ్దాల చరిత్రకల్గిన ఆనాడు శ్రీలక్ష్మి నరసింహ స్వామి దివ్య విగ్రహాన్ని పున ప్రతిష్టించారని విజయ సింహాఆచార్ ప్రస్తావిస్తూ

- తరువాయి 2లో..

### డిసిసిబీ చైర్మన్‌గా

# తుమ్మల రామస్వామి

**పార్టీ విధేయుడికి సముచిత స్థానం**
**జనసేన కార్యకర్తల్లో**
**వెల్లు విరిసిన ఆనందం..**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :**తూర్పుగోదావరి,కాకినాడ జిల్లాల డిసిసిబీ చైర్మన్‌గా తుమ్మలరామస్వామి (బాబు)ని నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీని కష్టకాలంలో ఆదుకొని కొన్ని ఏళ్లు పార్టీ కోసం లక్షలాది రూపాయలు సొంత డబ్బులు ఖర్చు చేసి, పొత్తులో భాగంగా పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి అవకాశం రాకపోయినా.. పార్టీ విధేయకుడిగా పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప గెలుపుకు శక్తి వంచన లేకుండా కృషి చేసి అఖండ మెజార్టీ సాధించేలా చేసిన కృషివలుడు తుమ్మల రామస్వామి. జనసేన కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణకు మారు పేరుగా నిలుస్తారని

- తరువాయి 2లో..



డిసిసిబీ చైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు)ను అభినందిస్తూ ప్రజా సేవకు అంకితం అవడంతో పాటు, జనసేన పార్టీ వృద్ధికి కృషి చేయాలని తెలిపిన ఉప ముఖ్యమంత్రి,జనసేన అధినేత పవన్ కళ్యాణ్...

# ఉచిత వైద్య శిబిరంలో 200మందికి వైద్య సేవలు





### - రోగులు, వారి సహాయకులకు అన్నదానం

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయసందజీ మహారాజ్ తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ మిషన్ క్యాంపు ఇన్చార్జి స్వామి లోకమయనందజీ మహారాజ్ పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ తలారి సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమామహేష్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి 64మందికి రక్తపరీక్షలు, 14మందికి థైరాయిడ్ పరీక్షలు చేసినట్లు స్వామీజి తెలిపారు. కాగా పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు.

ఈ కంటి వైద్య శిబిరంలో 45మందికి కంటి పరీక్షలు చేసి 15మందికి కళ్లజోళ్లు అందించారు. కంటి ఆపరేషన్లు నిమితం 4 గురుని వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించారు. గిరిజన ప్రాంతాల్లో రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజి విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరం సందర్భంగా హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్టు స్వామీజీ తెలిపారు.

# డిసిసిబీ చైర్మన్‌గా తుమ్మల రామస్వామి

మొదటిపేజి తరువాయి

చాటి చెప్పిన ప్రజానాయకుడు తుమ్మల బాబు. విధేయుడికి సముచిత స్థానం కల్పిస్తూ డిసిసిబీ చైర్మన్‌గా తుమ్మల బాబును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఎంపిక చేశారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోలహాలు నిండింది. జనసేన కార్యకర్తలు అందరూ తమకే ఆ పదవి వచ్చినట్లుగా భావించి ఆనందోత్సాహంతో ఆదివారం గడిపారు. తండోప తండాలుగా తుమ్మల బాబు ఇంటికి తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ జనసేన అధినాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడవడమే తనకు తెలుసునని, ప్రజా సేవకు తన జీవితం అంకితం అన్నారు. తాను ఎంత ఎదిగినా కార్యకర్తనేనన్నారు. ప్రజలకు ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడమే తనకు తెలుసు అన్నారు. రైతులకు న్యాయం చేసేలా తాను కృషి చేస్తానని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషికి తన వంతు సహాయంగా పనిచేస్తానన్నారు. తూర్పుగోదావరి జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా తన నియామకం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లకు ఈ సందర్భంగా తుమ్మల బాబు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున తుమ్మల బాబుకు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

# టేకు రథంపై శ్రీ స్వామి,అమ్మవారి గ్రామోత్సవం




**అన్నవరం,మేజర్‌న్యూస్ :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శ్రీ స్వామి, అమ్మవార్లను గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించుటకు నూతనముగా తయారుచేసిన 30 అడుగుల టేకు రథంపై సర్వాంగ సుందరంగా సుగంధ భరిత పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించిన రథముపై శ్రీ స్వామి, అమ్మవార్లను ఆసీనులు చేసి వేద పండితులు, అర్చకులు, వ్రత పురోహితుల నడుమ శ్రీ స్వామి, అమ్మవార్ల రథోత్సవాన్ని కార్య నిర్వహణ అధికారి ఈర్ల సుబ్బారావు, అనువంశిక ధర్మకర్త ఐ.వి.రోహిత్ కొబ్బరికాయ కొట్టి, గుమ్మడికాయ దిష్టి తీసి శ్రీ స్వామి, అమ్మవార్ల రథం ముందుకు లాగారు.

సాయంకాలం నాలుగు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులతో కిటకిటలాడింది. శ్రీ స్వామి, అమ్మవార్ల రథం లాగుటకు దేవస్థానం సిబ్బందిని, పోలీస్ బలగాలను ఉపయోగించి రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

### అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా

# కూటమి పరిపాలన

మొదటిపేజి తరువాయి

గృహాలకు మరమ్మత్తులు నిర్వహిస్తున్నామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని పునః ప్రారంభిస్తామన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని విద్యార్థుల్లో రగిలించేందుకు ప్రతి గురుకులంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. పేద విద్యార్థులను సమాజంలో గొప్ప స్థాయికి తీసుకెళ్లాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు తపన పడుతున్నారన్నారు. నేటి యువత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సహకారాన్ని అందిపుచ్చుకొని, ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత పదవులను అధిరోహించాలన్నారు. వ్యాపారవేత్తలుగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం కొత్తపేట మండలం వాడపాలెంలో మంత్రి డోలా సచివాలయ భవనాన్ని, సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకే సచివాలయాల రేషనలైజేషన్ చేపట్టామన్నారు. ఆస్పిరేషనల్ సెక్రటరీ ద్వారా గ్రామాల్లో ఆర్టిజిఎస్ సేవలను అందిస్తామన్నారు. ఇప్పటికే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సులభతరంగా సేవలు అందిస్తున్నామన్నారు. ఎస్సీ ఎస్టీల సంక్షేమం గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పి 4 ద్వారా సమాజంలో పేదరికం లేకుండా చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని స్పష్టం చేశారు.

# సోమవారం మే 12వ తేదీన యధావిధిగా పిజిఆర్ఎస్

మొదటిపేజి తరువాయి

అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజలు వ్యయ ప్రయసలుపడి ప్రభుత్వ కార్యాలయాలకు వొచ్చి ఫిర్యాదు చెయ్యకుండా 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా తమ సమస్యలను తెలియ చేయడం ద్వారా కూడా పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియ చేశారు. మీకోసం ద్వారా నమోదు చేసిన ఫిర్యాదు యొక్క స్థితి తెలుసుకునే అవకాశం ఉందన్నారు.. సత్వర పౌర సేవలను పొందేందుకు ప్రభుత్వం అమలులోకి తీసుకుని వొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ను తమ సెల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు పౌర సేవలు అందుబాటులో తీసుకుని రావడం జరిగిందనీ పేర్కొన్నారు. నీటి తీరువా , తదితర పన్నుల చెల్లింపులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చెల్లించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ పరమైన సేవలు అందుబాటులోకి రావడం వల్ల అధికారులు చూట్టు తిరిగే అవసరం లేకుండా మీ మొబైల్ ఫోన్ కే ఆయా సేవలు అందుబాటులోకి తీసుకుని రావడం విశేషం అన్నారు.

# ఘనంగా లక్ష్మీ నరసింహ కళ్యాణ మహోత్సవం

మొదటిపేజి తరువాయి

ఇదేప్రాంగణంలో శ్రీ సత్యధీశ తీర్థ మరియు శ్రీ సత్యజ్ఞాన తీర్థ స్వామీజీల మూల బృందావనం ఉండటం గొప్పమధ్వఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని అన్నారు. త్వరలో గురువుల అనుగ్రహంతో అద్భుతమైన భవనం నిర్మాణం అవుతోందని వివరించారు. నరసింహ మంత్ర జపం నిత్యం చేయడం ద్వారా విశేషమైన ఫలితాలను అందుకోగలరని ఆయన వివరించారు. ముందుగా నరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను శాస్త్రక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని విజయసింహ ఆచార్ దంపతులు నిర్వహించి భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో బారు రమణారావు, కాకులవరకు భరణి కుమార్, కందాలం నరసింహారావు, చట్టి హనుమంతరావు ,కందాలం జయ రామారావు, వేణుగోపాలరావు, పవన్, ఆదిత్య, న్యాపతి రవి, చట్టి వెంకటరమణతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణోత్సవము ముందుగా నరసింహ మంత్రాన్ని అందరూ భక్తకంఠంతో జపించారు. అనంతరం అందరికి తీర్థప్రసాద వితరణ జరిగింది.

# అనారోగ్యం ప్రబలే ప్రమాదం ఉంది





**– భాజపా నగర కన్వీనర్ గట్టి**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పారిశుద్ధ్య పనుల పట్ల అశ్రద్ధ వహించడం ద్వారా ఆ ప్రాంతంలో అనారోగ్యం ప్రబలే ప్రమాదం ఉందని భారతీయ జనతా పార్టీ నగర కన్వీనర్ ప్రముఖ ఇంజనీర్ గట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ 11వ డివిజన్లో సిటీ కోకన్వీనర్ కొండేటి గంగాధర్ ఆధ్వర్యంలోరాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో గట్టి సత్యనారాయణ పర్యటించి ప్రజలతో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ప్రజలు అనేక సమస్యలను వివరించారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని కాలువలు శుభ్రపరచడం లేకపోవడం వల్ల దుర్గంధభరితంగా మారిందనే ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంకులు కూడా అధ్వాన స్థితిలో ఉందని వాటిని చూపించి మరీ వివరించారు. ఈ సందర్భంగాగట్టి సత్యనారాయన మాట్లాడుతూ కాలవల్లో పేరుకుపోయిన మట్టిని తీయకపోవడం వల్ల వాటర్ అంతా బయటే ప్రవహిస్తూ ఆ ప్రాంతమంతా దోమల కేంద్రంగా మారుతోందని దాని ద్వారా అనేక రోగాలు వచ్చేందుకు అవకాశం ఉందని ఆయన అన్నారు. కాకినాడ సిటీకి అత్యంత చెరువులో ఉన్న ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కాకినాడ పురపాలక సంఘ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప ఉందని ఇంతటి జనాభా కలిగిన ప్రాంతంపై పురపాలక సంఘ అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని ఆయన సూచించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ లీకులు మరియు నిర్మాణాలు పగిలిపోవడంతోపాటు దొంగతనాలు ఎక్కువగా ఉందని గట్టి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంతంలో సుమారు 12 సీసీ కెమెరాలు అమర్చడం ఎంతో అవసరమని ప్రభుత్వ అధికారులతో సంప్రదిస్తానని అంతకు ముందుగా తాను స్వచ్ఛందంగా 6 కెమెరాలను అమర్చేందుకు కృషి చేస్తానని గట్టి చెప్పారు. మాటామంతి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అనేక అంశాలను త్వరలో జిల్లా కలెక్టర్ మరియు కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని గట్టి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమర్ జవాన్లకు నివాళులర్పిస్తూ ర్యాలీ




**పెరవలి,మేజర్‌న్యూస్ :** భారత్ పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో అమరులైన జవాన్ లకు నివాళులు అర్పించే నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామంలో మే 11వ తేదీ ఆదివారం కానూరు గ్రామ పెద్దలు, వెంకయ్య స్వామి సమాజం, ఆంజనేయ స్వామి సంఘాలతో కలిసి కానూరు శ్రీ రామ కృష్ణ సేవా సమితి భారీ ర్యాలీ నిర్వహించింది. భారత్ అంటే శాంతి మంత్రాలే కాదు యుద్ధం తంత్రాలు కూడా తెలుసు అని నినాదాలు చేస్తూ అమర వీరులకు నివాళులర్పించారు.

భక్తి.. ఆధ్యాత్మికత.. అంటే చేతకాని తనం కాదని, మన చరిత్ర లో ఎంతో మంది నిరూపించారని.. సరియైన జీవన విధానం అలవాటు చేయడం ద్వారా పిల్లలకు దేశభక్తి అలవాటు చేసే ప్రయత్నంచేస్తున్నా మని సమితి కార్యదర్శి ప్రసాద్ రాజు తెలిపారు.ఈ కార్యక్రమం లో ముళ్ళపూడి రాజు, అనపర్తి సాంబమూర్తి, ఆలం సుబ్బారావు,మిలిటరీ బ్రహ్మం,ఆకుల శ్రీను తదితర సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాలలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన జాతీయ సాంకేతిక దినోత్సవం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య కళాశాల లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా సాంకేతిక రంగం లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థుల కు బహుమతులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అద్దాల మాట్లాడుతూ"మన భారతదేశంలో 1998లో పోఖ్రాన్‌లో జరిగిన విజయవంతమైన అణు పరీక్షలతో ప్రారంభమైన ఈ ఆచారం, భారతదేశ వృద్ధి మరియు అభివృద్ధిలో సాంకేతికత యొక్క కీలక పాత్రను నొక్కి చెబుతుందని, జాతీయ సాంకేతిక దినోత్సవం యొక్క సారాంశం యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం మరియు సాంకేతికత, ఇంజనీరింగ్ మరియు గణితంలో కెరీర్‌లను కొనసాగించడానికి వారిని ప్రేరేపించడం అని, ఇది విద్యాసంస్థలు, పరిశ్రమలు మరియు ప్రభుత్వాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తుందని అన్నారు. చారిత్రాత్మక పోఖ్రాన్ అణు పరీక్షల జ్ఞాపకార్థం భారతదేశంలో మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవంగా మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రకటించారని తెలిపారు.

ఆదిత్య కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా బి ఇ ఎల్ ఎన్ నాయుడు మాట్లాడుతూ" మే 11 , 2025 జాతీయ సాంకేతిక దినోత్సవం యొక్క థీమ్ – " ఆవిష్కరణ ద్వారా స్థిరమైన రేపటిని సాధికారపరచడం" అని, మెరుగైన భవిష్యత్తును నిర్మించడంలో ఆవిష్కరణ పోషించాల్సిన పాత్రను సకాలంలో గుర్తు చేస్తుందని తెలిపారు. మా ఆదిత్య కళాశాల లో సాంకేతిక రంగం లో పలు రకాల కోర్సులు నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు డా శ్రీ వల్లి,డా దీప, డా నాగేంద్ర ,ఆదిత్య కళాశాలల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ తేజేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

## ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ కాకినాడ నూతన అధ్యక్షునిగా గ్రంధి నారాయణరావు






**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ కాకినాడ ఆదివారం పెద్ది రత్నాజీ అధ్యక్షతన జరిగిన ఎన్నికల సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షునిగా గ్రంధి నారాయణరావు (బాబ్జి) ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్గా ప్రముఖ న్యాయవాది బచ్చు రాజేష్ మరియు పైడా భవాని ప్రసాద్ ఎలక్షన్ అధికారులుగా వ్యవహరించడం జరిగింది. నూతన కార్యదర్శిగా పసుమర్తి కాశీ, కోశాధికారిగా గుర్రం సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా దేగల రమేష్ లను గ్రంధి నారాయణరావు నామినేట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాసరి సాయి కృష్ణ, నూలు పూర్ణయ్య, గమిని సత్యం, బోగవిల్లి రామారావు, దేగల రమేష్ మరియు చాంబర్ సభ్యులు, వ్యాపార వర్తక ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇరువురిపై కేసు నమోదు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలపరిధిలోని బొబ్బర లంక సమీపంలో ఆదివారం పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు ఆత్రేయ పురం ఎస్సై ఎస్.రాము తెలిపారు. సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా నిబంధనలు విరుద్ధంగా ఇద్దరు వ్యక్తులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఎవరైనా పేకాట కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ ఆదివారం దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్టీయుకెలో 'రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025' సదస్సు





**కాకినాడ,మేజర్‌న్యూస్** : జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఆదివారం అలూమ్ని ఆడిటోరియం నందు యూనివర్శిటీ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ (ఆర్&డి) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రీసెర్చ్ స్కాలర్స్‌కు 'రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025' సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని కాగ్నోల్యాబ్స్ సిఇఓ డా.ఎం.యోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆర్&డి డైరెక్టర్ ప్రొ.వి.రవీంద్ర సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించగా యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.మోహన్‌రావు, యుసిఇఎన్ ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్. శ్రీనివాసరావులు కో-కన్వీనర్లుగాను, డైరెక్టర్‌లు ప్రొ. ఏ.గోపాలకృష్ణ, ప్రొ. ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, ప్రొ. బి.టి.కృష్ణ లు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.ఈసందర్భంగా కాగ్నోల్యాబ్స్ సిఇఓ డా.ఎం.యోగేశ్వరరావు 'ఉత్సుకత నుండి లక్ష్యం వరకు: పరిశోధనా శక్తి' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్ స్కాలర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా మన ఆలోచనలను, ఆవిష్కరణలను పంచుకోవడానికి మంచి వేదికగా నిలుస్తుందన్నారు. పరిశోధనా విభాగంలో అనేక అంశాలు ఉంటాయని, పరిశోధనలో నాణ్యత, పరిశోధన-పరిశ్రమల అనుసంధానం, ప్రపంచ పరిశోధనా ధోరణి వంటిఅంశాలను వివరించారు. సమస్యలను పరిష్కరించడం, ఆవిష్కరణ, అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, జ్ఞాన విస్తరణ వంటి అంశాలు పరిశోధన యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పరిశోధనా విభాగానికి సంబంధించి పేపర్ ప్రజంటేషన్‌లో 2017 మరియు 2022లో ప్రపంచ వ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి రెండు స్థానాలలో ఉండగా 1,91,590 పేపర్స్‌తో భారతదేశం నాల్గవ స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత సాంకేతికత తరుణంలో రీసెర్చ్ స్కాలర్స్ ముఖ్యంగా ప్రపంచ పరిశోధనా ధోరణులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్‌పై పరిశోధన, ఇంటర్‌డిసిప్లినరీ కొలాబొరేషన్, స్థిరమైన మరియు పర్యావరణ అనుకూల సాంకేతికతలు, అంతరిక్ష అన్వేషణ మరియు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై దృష్టి సారించాలన్నారు.ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ రీసెర్చ్ కాన్‌క్లేవ్ ద్వారా పరిశ్రమ, విద్యాసంస్థలు, పరిశోధక విద్యార్థుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి మరియు వినూత్న పరిశోధన, సహకారాన్ని ప్రోత్సహించేందుకు రూపొందించబడిన కార్యక్రమం అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమ నిపుణులు, విద్యా నిపుణులు, రీసెర్చ్ స్కాలర్స్ మధ్య అర్థవంతమైన పరస్పర చర్యలను, జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడానికి రూపొందించబడిందన్నారు. ఇటువంటి సమావేశాల ద్వారా పర్యావరణ, సామాజిక మరియు ఆర్థిక సవాళ్లను పరిష్కరించడానికి విభిన్న రంగాల సంభాషణ, జ్ఞాన భాగస్వామ్యం, సహకారాన్ని సులభతరం చేయడంతో పాటు ప్యానెల్ చర్చలు నిర్వహిస్తారన్నారు. సాంకేతిక అభివృద్ధి, సాంకేతిక స్థిరత్వం ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారతదేశం 40% ఎగుమతులను చేస్తుందన్నారు. గతంలో మన రూపాయి విలువ రెండు డాలర్లతో సమానంగా ఉండేదని, మళ్లీ దాన్ని అందిపుచ్చుకునేలా పరిశోధనలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మన రాజధాని అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు నూతన ఆవిష్కరణలకు వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సిఎం చంద్రబాబునాయుడు గారు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించడం జరిగిందని, దీని ద్వారా 20వేల మందిని ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. జెఎన్‌టియుకె యూనివర్శిటీ పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రీసెర్చ్ స్కాలర్స్‌కు త్వరలో యూనివర్శిటీలో సెంట్రలైజ్డ్ రీసెర్చ్ సదుపాయం, లైబ్రరీ సదుపాయం, మౌలిక వసతుల కల్పన, మ్యాట్‌ల్యాబ్‌సాఫ్ట్‌వేర్‌వంటి సదుపాయాలను కల్పించనున్నామన్నారు.ఆర్&డి డైరెక్టర్ ప్రొ.వి.రవీంద్ర మాట్లాడుతూ ఈ రీసెర్చ్ కాన్‌క్లేవ్ ద్వారా వివిధ రంగాలకు చెందిన పరిశోధనా విద్యార్థులు మరియు ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి నూతన ఆవిష్కరణా ఆలోచనలను పంచుకోవడం జరుగుతుందన్నారు. వివిధ పరిశోధనా రంగాలలో కొత్త ఆలోచనలు, పద్ధతులు, సాంకేతికతలను ప్రేరేపించడానికి ప్రయత్నిస్తుందన్నారు. పోఖ్రాన్‌లో 1998 మే 11న భారతదేశం అణుబాంబులను విజయవంతంగా పరీక్షించడంతో ఈ రోజు భారతదేశ సాంకేతిక ఆవిష్కరణల చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోయిందని, అందువలన ప్రతీ ఏడాది ఈరోజున జాతీయ సాంకేతిక దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. అలాగే పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడుతున్న భారతదేశ సైనికుల పోరాటపటిమకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రీసెర్చ్ కాన్‌క్లేవ్‌కు 210 మంది హాజరు కాగా వారిలో 110మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు,మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు,బోధన&బోధనేతర సిబ్బంది, జెఎన్‌టియుకె మరియు అనుబంధ కళాశాలల పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మన్యం కవిని వరించిన జాతీయ పురస్కారం



**చింతూరు, మేజర్ న్యూస్** : ప్రపంచంలోనే అతి పెద్ద సాహిత్య సంస్థగా పేరొంది సాహిత్య చరిత్రలో ప్రభంజనం సృష్టిస్తున్న ఐయస్ఓ గుర్తింపు పొంది తెలుగు భాష - తెలుగు సంస్కృతి తెలుగు వైభవం- తెలుగు సాహిత్యం - తెలుగు కళలు పరిరక్షణ కోసం నిరంతరాయంగా సాహిత్య కార్యక్రమాలతో దూసుకువెళ్తున్న శ్రీశ్రీ కళావేదిక మే 10,11 తేదీలలో ఏలూరులో నిర్వహించిన ప్రపంచ సాహితీ సంబరాలు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తిష్ గడ్, గుజరాత్, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలనుండి 1000 మందికి పైగా కవులు కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మన్యం కవి నూనె రమేష్ ను సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న సేవలనుగుర్తించి "జాతీయ యువ కీర్తి" ప్రతిభా పురస్కారాన్ని శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సియిఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రపంచ ప్రసిద్ధ గజల్ గాయకులు గజల్ శ్రీనివాసు, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయ కర్త కొల్లి రామావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టె లలిత, సాహితీ సంబరాల కన్వీనర్ పార్థసారథి ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు.

మూడు ప్రపంచ రికార్డ్ కవి సమ్మేళనాలలో పాల్గొని ప్రపంచ రికార్డ్స్ లో పేరు నమోదు చేసుకొని, పదుల సంఖ్యలో జాతీయ శతాదిక కవి సమ్మేళనాల పురస్కారాలు పొంది,ఐదు వందలకు పైగా సామాజిక ఈతివృత్తాలతో కవితలు వ్రాసి, రెండు తెలుగు రాష్ట్రాలే కాక ఇతర రాష్ట్రాలలో కూడా సాహితీ పురస్కారాలు పొంది అనతి కాలంలోనే జాతీయ అవార్డు గెలుచుకున్న కవి రమేష్ ను గ్రామస్తులు, మండల ప్రముఖులు, స్నేహితులు అభినందించారు. ఇంతటి ఘనత సాధించడం పట్ల నూనె రమేష్ తల్లిదండ్రులు నూనె అజరయ్య దంపతులు ఆనందం వ్యక్తం చేసారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ- ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్** : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలిపారు.

## స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన

- పాఠకులకు జిగిని రాజేష్ ఖన్నా

కూలింగ్ వాటర్ ఫిల్టర్ బహుకరణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్** :పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, గణితం, సైన్స్, తెలుగులో నామవాచకాలపై వివరించడం జరిగింది. దీనిలో భాగంగా పెద్దాపురానికి చెందిన ప్రముఖ దాత జిగిని రాజేష్ ఖన్నా గ్రంథాలయ పాఠకుల ఉపయోగార్థం కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను బహుకరించారని, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిగిని రాజేష్ ఖన్నా డిఎస్సీ అభ్యర్థుల ఉపయోగార్థం స్టడి మెటిరియల్ అందజేశారని, ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిగిని రాజేష్ ఖన్నాను, వారి తండ్రి జిగిని లక్ష్మణరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు లెక్చరర్ డా.జోశ్యుల కృష్ణబాబు, రాళ్ళపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది బుల్లియ్య, కొమ్మన అప్పారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యధావిధిగా గ్రీవెన్స్ కార్యక్రమం

**అమలాపురం,మేజర్‌న్యూస్** : ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 12 సోమవారం ఉదయం 10 గంటలనుండి యధావిధిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో జరుగునని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితోపాటు డివిజన్, మండలం,మున్సిపల్ స్థాయి లో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం జరుగునని కలెక్టర్ పేర్కొన్నారు.

డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో జరుగుతాయని డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు.

మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని..ఈ కార్యక్రమంలో సంబంధిత మండల తహసిల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతోపాటు మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అన్నవరప్పాడు వెంకన్న సన్నిధిలో తులసి బృందార్చన కార్యక్రమం





-స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఈవో మీసాల రాధాకృష్ణ దంపతులచే తులసి మొక్కల పంపిణీ
-అంగన్వాడి ఓసూరి రామలక్ష్మి శ్రీనివాస్ దంపతులుచే ఉచిత ప్రసాద వితరణ

**పెరవలి, మేజర్‌న్యూస్ :** స్త్రీ సౌభాగ్యం వృద్ధి చెందాలి అనే సంకల్పంతో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడు వెంకన్న ఆలయంలో మే 11వ తేదీ ఆదివారం తులసి బృందార్చన అనే కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు ఆదివారం ఆలయంలో ఈ తులసి బృందార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తులసి మొక్కలకు అర్చనలు జరిపి ఆలయ ఈవో మీసాల రాధాకృష్ణ దంపతులు తులసి మొక్కలను భక్తులకు పంపిణీ చేశారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నవరప్పాడు అంగన్వాడి ఓసూరి రామలక్ష్మి శ్రీనివాస్ దంపతులు ఉచిత ప్రసాదవితరణ చేశారు. అన్నవరపాడులో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమై అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అన్న వెంటనే వరాలిచ్చే అన్నవరప్పాడు వెంకన్న గా ఇక్కడ ప్రసిద్ధి చెందిన శ్రీవారిని భక్తులు ఏడు శనివారాలు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. స్కూళ్లకు సెలవులు కావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి విచ్చేశారు. శ్రీవారి సేవకులు అధిక సంఖ్యలో పాల్గొని తులసి మొక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణ తులసి లక్ష్మీ తులసి మొక్కలను ఒకే కుండీలో పెంచి వాటిని భక్తులకు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన తులసి మొక్కలను ఇంటి తులసి కోటలో ఇంటి ఆవరణలో పెంచుకోవడం ద్వారా ఆయురారోగ్యాలు పొందవచ్చు అని ప్రత్యేక తులసిపూజలునిర్వహించిన వేదపండితులుభక్తులకు వివరించారు స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులు అందరికీ దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఉచిత అన్న ప్రసాదం వితరణ దిగ్విజయంగా చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు.

# ప్రైవేటు బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఖండవల్లి జాతీయ రహదారి సెంటర్ వద్ద మే 11వ తేదీ ఆదివారం ప్రైవేట్ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం కి చెందిన కపిలేశ్వరపు రామకృష్ణ, తండ్రి. నాగేశ్వరరావు అను అతను తన భార్య మరియు కుమారిని తో కలసి బంధువుల ఇంటికి పెనుగొండ మండలం రామన్నపాలెం గ్రామానికి తన మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఖండవల్లి సెంటర్ కి వచ్చుసరికి ట్రావెల్ బస్ వెనుక నుండి గుద్దుట వలన ముగ్గురికి రక్త గాయాలు అయినట్లు, ముగ్గురిని తణుకు హాస్పిటల్ కి తరలించామని పెరవలి ఎస్సై ఎం వెంకటేశ్వరావు మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఈ సంఘటనపై పెరవలి ఎస్.ఐ యం.వేంకటేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపి ఈఏపి సెట్-2025 పరీక్షకు 3,61,299 మంది విద్యార్థులు దరఖాస్తు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ & ఫార్మశీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపి ఈఏపి సెట్)-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు ఆదివారం వరకు 3,61,299 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఏపి ఈఏపి సెట్-2025 ఛైర్మన్ మరియు జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,79,538 మంది దరఖాస్తు చేసుకోగా, అగ్రికల్చర్ & ఫార్మశీ విభాగానికి 80,849 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు విభాగాలకు 912మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఏపి ఈఏపి సెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 12వ తేదీ సోమవారం నుండి తమ హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సోమవారం నుండి ఏపి ఈఏపి సెట్-2025 హాల్‌టికెట్‌లను విద్యార్థులు ఏపి ఈఏపి సెట్ వెబ్‌సైట్ https://cets.apsche.ap.gov.inతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ '9552300009' ఫోన్ నెంబర్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన పరీక్షా కేంద్రం యొక్క రూట్‌మ్యాప్‌ను తెలుసుకునేందుకు హాల్‌టికెట్ చివరి పేజీలో గూగుల్ మ్యాప్ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం యొక్క పూర్తి చిరునామాను https://cets.apsche.ap.gov.in /eapcet/Eapcet/EAPCET_Centers.aspx ద్వారా తెలుసుకోవడంతో పాటు గూగుల్ మ్యాప్‌ను పొందవచ్చునన్నారు. విద్యా ర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884- 2342499 ఫోన్ నెంబర్ల ద్వారా గాని, helpdeska-peapcet@ apsche.or మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించవచ్చునని కన్వీనర్ ప్రొ.వి.వి.సుబ్బారావు తెలిపారు.

# కాకరపర్రు హైస్కూల్ 1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కాకరపర్రు గ్రామంలో గల శ్రీ వెంకట శాస్త్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1990 - 1995 బ్యాచ్ పూర్వ విద్యార్థిని విద్యార్థుల సమ్మేళనం మే 11వ తేదీ ఆదివారం తమ కుటుంబ సభ్యుల సమక్షంలో ఉత్సాహంగా జరిగింది. ఈ పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కుటుంబ సభ్యులతో సహా తిరిగి కలవడంతో వారి ఆనందోత్సవాలకు అల్లరికి అంతే లేకుండా పోయింది. తల్లితండ్రులు కూడా వచ్చిన పిల్లలు తమ తల్లిదండ్రులు చదువుకున్న పాఠశాల పరిసరాలలో కలయతిరిగారు.

# వీర జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి



పిఠాపురం, మేజర్ న్యూస్ : "ఆపరేషన్ సింధూర్" లో భాగంగా పాకిస్తాన్ సరిహద్దుల్లో శత్రు సైనికులతో పోరాడుతూ వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళి నాయక్ కు సహృదయ మిత్రమండలి సభ్యులు, విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలోని చెలికాని భావనరావు సభా సదన్ లో మిత్రమండలి సభ్యులు మరియు శిక్షణ పొందుతున్న విద్యార్థులు వీర జవాన్ కు పుష్పమాలలు సమర్పించి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... మురళి నాయక్ వారి తల్లిదండ్రులకు ఏకైక సంతానమని, శ్రీ సత్య సాయి జిల్లాలోని " కల్లి తండా " లో వీరి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ తమ కుమారుడిని చదివించారని, తాను ఎప్పుడు చనిపోయినా మిలిటరీ దుస్తుల్లోనే చనిపోవాలని తల్లిదండ్రులతో చెప్పేవాడని, తాను కోరుకున్నట్టుగానే అతి పిన్న వయసులో సైనిక దుస్తుల్లోనే వీరమరణం పొందిన గొప్ప దేశభక్తుడని, ప్రతి విద్యార్థి ఆయన లాంటి దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పోతుల శ్రీనివాసు, కొటేషన్ మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ సతీష్, సీనియర్ సభ్యులు కెవివి ప్రసాద్, కొమ్మనాపల్లి అప్పారావు, మహిళా కార్యదర్శి శ్రీమతి పావని, పోలీస్ కానిస్టేబుల్ కరుణ కమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 3వ ఓపెన్ టైక్వాండో విజేత పిఠాపురం



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 3వ ఓపెన్ తైక్వాండో పోటీలు ఆదివారం స్థానిక భాష్యం పాఠశాల నందు నిర్వహించారు. పిఠాపురం జనసేన పార్టీ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నల మూలల నుండి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. విజేతలుగా మొదట స్థానంలో పిఠాపురం, రెండో స్థానంలో కాకినాడ, మూడో స్థానంలో అమలాపురం నిలిచింది. పోటీల అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బి అసోసియేషన్ చైర్మన్ రామన్న రాజు, సభ్యులు ఇమ్మిడి శెట్టి నాగేంద్ర కుమార్, చైతన్య, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ విద్యాసంస్థలు చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇంచార్జ్ గోవిందరాజులు పిఠాపురం భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ వేణు విజేతలను అభినందించారు. ఈ పోటీలో నిర్వహణ కార్యదర్శిగా పి. లక్ష్మణరావు వ్యవహరించారు.